క్లుప్తంగా

జగన్ ఇచ్చారు.. బాబు మరిచారు..

కోరుకొండ: పుణ్యక్షేత్రమైన కోరుకొండ రైతులకు నిరాశే మిగిలింది. కూటమి పాలనలో రెండో సంవత్సరంలోనైనా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలు అందుతాయని భావించిన వారి కోరిక నెరవేరలేదు. మండల కేంద్రమైన కోరుకొండ రైతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా అందజేసింది. ఆ గ్రామంలో 780 ఎకరాల విస్తీర్ణంలో భూమి ఉండగా, 710 ఎకరాల విస్తీర్ణంలో సాగుభూమి ఉంది. దీనిని 230 మంది సాగుచేస్తున్నారు. వీరికి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నుంచి సాయం అందలేదు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం భూములుగా రికార్డులో ఉండటంతో ఆన్‌లైన్ ప్రక్రియలోనే నమోదు లేదని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రజాప్రతినిధుల ప్రయత్నాలు లేకపోవడంతోనే సమస్య ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

మచ్చ నాగయ్య సేవలు మరువలేనివి



నాగయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పెదపూడి: పీడీఎస్‌యూ విద్యార్థి నాయకుడిగా, విప్లవ ఉద్యమకారుడిగా మచ్చ నాగయ్య అందించిన సేవలు మరువలేనివని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు అన్నారు. జి.మామిడాడలోని బస్టాండ్ వద్ద ఏపీఆర్‌సీఎస్, ఏఐఎఫ్‌టీయూ, ప్రగతిశీల మహిళా సంఘం తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం మచ్చ నాగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజబాబు మాట్లాడుతూ మచ్చ నాగయ్య రాష్ట్ర నాయకుడిగా పనిచేస్తూ ఇటీవల అమలాపురంలో వైద్యం పొందుతూ తుదిశ్వాస విడిచారన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడి



ఈలకొలనులో సారా విక్రేతలను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: మండలంలోని వెంకటాపురం, ఈలకొలను గ్రామాల్లో శనివారం ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది దాడి చేశారు. ఈ సందర్భంగా వెంకటాపురంలో సారా విక్రయిస్తున్న గుడాల శ్రీనును అరెస్టు చేసి, అతడి నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. అలాగే ఈలకొలనులో సారా కలిగి ఉన్న అంచూరి వెంకటలక్ష్మిని అరెస్టు చేసి, 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న సారా విక్రేత టేకుమూడి బాపనమ్మను కూడా అరెస్టు చేసినట్టు ఆమె చెప్పారు. ముగ్గురు నిందితులను రిమాండుకు తరలించామన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీ ఎస్సై రవీంద్ర బాబు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాల విద్యార్థులు సైబర్ నేరాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఎస్సై వి.రవీంద్రబాబు మాట్లాడుతూ సైబర్ నేరాలు అంటే ఏమిటి, వాటి వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఇంటి వద్ద తల్లిదండ్రులకు వీటి గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎ.సత్యనారాయణ, ఎ.సురేష్ కుమార్, ఎన్. శ్రీసత్య, పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయుడు శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

శిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించాలి



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగరత్నం

రాజానగరం: శిక్షణను సద్వినియోగపరచి, ఉత్తమ ఫలితాలు పొందాలని ప్రాంతీయ విద్యా సంచాలకులు (ఆర్‌జేడీ) జోన్-2 ఎ.నాగరత్నం అన్నారు. మండలంలోని మల్లంపూడి సాయి మాధవి ఇంజినీరింగ్ కళాశాల భవనాలలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలకు చెందిన కాంట్రాక్టు ఉపాధ్యాయులకు ఆరు రోజులుగా జరుగుతున్న వృత్యంతర శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. జిల్లా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 12 జిల్లాలకు చెందిన 182 మంది ఉపాధ్యాయులు, రీసోర్సుపర్సన్లకు ఆంగ్ల బోధనలో మెళకువలు, విద్యార్థి కేంద్రీకృత బోధన, ఆధునిక బోధన పోకడలు, కృత్యాధార బోధన, పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాల పెంపు మున్నగు వాటిలో శిక్షణ ఇచ్చారు.

ఏడాది పాలనలో అన్నీ వైఫల్యాలే

- మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ
- సీతానగరంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం
- కూటమి మోసాలపై ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి విజయలక్ష్మి



మాట్లాడుతున్న జక్కంపూడి రాజా

సీతానగరం: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అన్నీ వైఫల్యాలేనని, వాటిని ప్రజల్లోకి తీసుకువెళదామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అధ్యక్షతన శనివారం సీతానగరంలోని జీవీకే కన్వెన్షన్ హాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పని, మడమ తిప్పని మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ప్రజల్లోకి వస్తే కూటమి ప్రభుత్వం ఎంత కట్టడి చేసినా తండోపతండాలుగా జనం వస్తారని గుర్తు చేశారు. మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావుతో తనకు ఎంతో అనుబంధం ఉందని, ఆయన మద్దతుతో ఈస్థాయికి ఎదిగానని గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడు 2014లో అధికారంలోకి వచ్చి ఒక్క హామీని అమలు జరపలేదని, అదే విధంగా ఇప్పుడూ అధికారం చేపట్టి.. ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి అమలు చేయని ఘనత అతనికే దక్కుతుందన్నారు. ఆయనకు డైవర్షన్ రాజకీయాలు చేయడం వెన్నతో పెట్టిన విద్య అన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ ప్రశ్నిస్తుందని, అవసరమైతే ఉద్యమిస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు అవుతోందన్నారు.

కూటమిపై ప్రజల్లో వ్యతిరేకత : జక్కంపూడి రాజా

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందించారని, పాలన పరంగా సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోనే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఆ వైఫల్యాలను ప్రశ్నించిన వారి ఆస్తులను నష్టపరుస్తూ, భౌతిక దాడులు చేస్తూ, కేసులు పెడుతున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ కోసం పని చేసే నాయకులు, కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటామన్నారు. పార్టీ బలోపేతానికి కలసి పనిచేద్దామని, గతంలో పార్టీ నుంచి బయటకు వెళ్లిన ప్రతి ఒక్క ఓటరూ తిరిగి మన పార్టీకి వచ్చేలా చూద్దామన్నారు. మన పార్టీ చేసిన మంచిని ప్రజలకు వివరించాలని, అలాగే కూటమి ప్రభుత్వ వైఫల్యాలనూ ప్రజలకు తెలియజేయాలన్నారు.

ప్రజలను మోసం చేసిన కూటమి

పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ సుపరిపాలన అందిస్తే, కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజలకు తెలియపర్చే కర్తవ్యం ప్రతి ఒక్క నాయకుడికి, కార్యకర్తకు ఉందన్నారు. సమావేశంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీలు ముదునూరి సురేష్ రాజు, సత్యం మదన్ బాబు, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, కన్వీనర్ ఘంటా శ్రీనువాస్, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, నియోజకవర్గం ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు పోలినాటి ఈశ్వరుడు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వలవల వెంకట్రాజు, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, చల్లమళ్ల సుజీరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి సందర్శన



అనపర్తి ఏరియా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: గ్రామంలోని ఏరియా ఆస్పత్రిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శనివారం సందర్శించారు. ఆస్పత్రిలోని రోగులను పరామర్శించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ అందుతున్న సౌకర్యాలు, వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులతో మాట్లాడి రోగులకు అవసరమైన సలహాలు సూచనలు అందించారు.

దంత వైద్యశిబిరం



దంత పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రాజానగరం: భూపాలపట్నంలోని రైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ట్రయో డెంట్ కేర్, డెంటల్ క్లినిక్‌ల ఆధ్వర్యంలో శనివారం దంత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 500 మంది విద్యార్థులు, అధ్యాపకులకు దంత పరీక్షలు నిర్వహించారు. దంత సంరక్షణపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం మందులు అందజేశారు.

పలువురికి జక్కంపూడి రాజా పరామర్శ



గాదరాడలో పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శనివారం నియోజకవర్గంలోని పలు కుటుంబాలను పరామర్శించారు. కోరుకొండ మండలం నర్సాపురానికి చెందిన నక్కా అర్జునరావు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను రాజా పరామర్శించారు. గాదరాడలో చీర్ల సోమన్న తల్లి, గొడ్డు చంద్రరావు మనవరాలు, అత్తిలి అరవాలమ్మ ఇటీవల మరణించారు. ఆ కుటుంబ సభ్యులను రాజా పరామర్శించారు. గాదరాడలో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని, ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న బత్తిన రాంబాబు, సుంకర వెంకటేశ్వరరావు భార్య, కోటి అమ్మిరాజు మేనల్లుడిని పరామర్శించారు. కోరుకొండలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నష్ట పోయిన సప్లయి కంపెనీ యజమాని నరసింహారావు, బొల్లెద్దుపాలెంలో గుండెకు శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పూసల మహేశ్వరరావును పరామర్శించారు. రాజానగరం మండలం పాలచర్లలో రాజాకు నానమ్మ వరసయ్యే ఆమె ఇటీవల మరణించారు. ఆ కుటుంబ సభ్యులకు ఓదార్చారు. నరేంద్రపురంలో బేదంపూడి సూర్యారావు తలకు గాయమై, చికిత్స పొంది, ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కోలమూరు, కొంతమూరులోని తాటికొండ అరవాలమ్మ, చెరుకూరి కృష్ణ కుమారుడు, మౌలాలి అల్లుడు ఇటీవల మరణించారు. ఆయా కుటుంబ సభ్యులకు పరామర్శించారు.

అవినీతిపై ఎమ్మెల్యే స్పందించాలి

- ఆధారాలతో ప్రశ్నించినా మౌనం వీడకపోవడం దారుణం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ధ్వజం



డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

అనపర్తి: ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వగ్రామమైన రామవరంలో గోవా క్యాసినో తరహాలో నిర్వహిస్తున్న పేకాట క్లబ్‌పై జరిగిన ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసుల దాడిపై ఆయన ఇప్పటి వరకు స్పందించకపోవడంతో నియోజకవర్గ ప్రజలు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రామవరంలో ఆయన సోదరుడు గోపాలకృష్ణారెడ్డి యాజమాన్యంలోని స్థలంలో గోవా క్యాసినో తరహాలో కాయిన్స్‌తో ఒక్క కాయిన్‌కు రూ.500 నుంచి రూ.5 వేల వరకూ విలువ నిర్ణయించి పేకాట క్లబ్ నడుస్తుండగా పోలీసులు దాడి చేసి 27 మందిని అరెస్ట్ చేశారన్నారు. కార్లు, బైకులు, పెద్ద మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ విషయమై ఆధారాలతో పాటు ప్రశ్నించినా ప్రతి స్పందించాల్సిన ఎమ్మెల్యే మౌనం వీడకపోవడం గమనార్హమన్నారు. ప్రతి చిన్న విషయాన్ని గంటల తరబడి సోదాహరణంగా వివరించే ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి.. నియోజకవర్గంలో ఇప్పటికీ నిరాటంకంగా జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు, మద్యం షాపుల నుంచి ముడుపులు, జూదశాలల వంటి అవినీతి కార్యక్రమాలపై స్పందించకపోవడం తగదన్నారు. తన అనుచరులతో ఆ విషయాలను పక్కదోవ పట్టించడం చూస్తుంటే ఆయన ప్రమేయంపై పూర్తి అంగీకారం తెలియచేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రామవరం, కుతుకులూరు, పొలమూరు తదితర గ్రామాల్లోనూ స్థానికుల ఒత్తిడి మేరకు పేకాట క్లబ్‌లపై పోలీసులు దాడులు నిర్వహించారన్నారు. ఈ అక్రమ కార్యకలాపాల ద్వారా వచ్చిన లక్షల రూపాయల ముడుపుల్లో సింహభాగం అంతఃపురానికి ఏరోజుకారోజు చేరుతాయని వారి కార్యకర్తలే బహిరంగంగా చెబుతున్నారన్నారు. ఇప్పటి వరకు కేవలం పేకాట ద్వారానే రూ.8 కోట్లకు పైగా ముడుపులు అందాయని ఆరోపించారు.

ఆక్వా సాగు బలోపేతానికి మరింత కృషి



ఏపీత్రయంలో ఆక్వాసాగు పరిశీలన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న శ్రావణి కుమారి

పెదపూడి: ఆక్వా సాగులో ప్రబలుతున్న వ్యాధులను అధ్యయనం చేసి, వాటి నిర్ధారణకు పరీక్షలు నిర్వహించి సాగు మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర మత్స్య సాంకేతిక సంస్థ (ఎస్ఐఎఫ్‌టీ) కాకినాడ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ కె.శ్రావణి కుమారి అన్నారు. ఎస్ఐఎఫ్‌టీ ఆధ్వర్యంలో అమలవుతున్న నేషనల్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ ఫర్ ఆక్వాటిక్ యానిమల్ డిసీజ్ (ఎన్ఎస్‌పీఏఏడీ) ఫేజ్-2లో భాగంగా మండలంలో రామేశ్వరం, ఏపీత్రయం గ్రామాల్లో శనివారం ఆక్వా సాగు చెరువులను అధికారుల బృందం పరిశీలించింది. ఈ బృందంలో శ్రావణి కుమారితో పాటు ఎస్ఐఎఫ్‌టీ సహ నోడల్ అధికారి దత్తాత్రేయ, ఎన్ఎస్‌పీఏఏడీ ప్రతినిధులు, యంగ్ ప్రొఫెషనల్స్ ఎస్.చైతన్య, శివరామకృష్ణ, జూనియర్ కన్సల్టెంట్ పి.శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ డి.వంశీ తదితరులు చెరువుల్లో జంతు, నీటి నమూనాలు, మట్టి సేకరించారు. వాటిపై సూక్ష్మజీవశాస్త్ర పరీక్షలు, పాలిమరేజ్ చైన్ రియాక్షన్ (పీసీఆర్)వంటి ఆధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

సాగు ప్రోత్సాహమే లక్ష్యం

శ్రావణి కుమారి మాట్లాడుతూ ఎస్ఐఎఫ్‌టీ ప్రిన్సిపాల్ అంజలి ఆదేశాలపై ఈ పరిశీలన చేపట్టామన్నారు. ఆక్వా రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తూ ఆక్వా సాగు ప్రోత్సాహమే లక్ష్యంగా వివిధ ఆక్వా సాగు ప్రాంతాల్లో పరిశీలనలు చేస్తున్నామన్నారు. ఈ రంగంలో ఆటోమెటిక్ ఫీడర్ వంటి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ పరికరాల ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ఇవి నీటి ఉష్ణోగ్రత, నాణ్యత, పీహెచ్ స్థాయిలు వంటి ముఖ్యమైన మార్గదర్శకాలను పర్యవేక్షించడమే కాకుండా, చేపలు, రొయ్యల సాగు ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే పరిస్థితులను ముందుగానే గుర్తించి, వ్యాధులను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రాంతీయ స్థాయిలో చేపల, రొయ్యల సాగు ఆరోగ్య పరిస్థితిపై సమగ్ర సమాచారం లభిస్తుందన్నారు.

మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణకు సత్కారం



మాజీ మంత్రి వేణును సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ అనపర్తి శ్రేణులు

అనపర్తి: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను ఆ పార్టీ అనపర్తి నాయకులు ఘనంగా సత్కరించారు. రాజమహేంద్రవరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం వేణు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన అనపర్తి నియోజకవర్గం నుంచి జిల్లా కమిటీలో స్థానం పొందిన నాయకులు మాజీ మంత్రి వేణును సత్కరించి, అభినందించారు. వారిలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు, జిల్లా పార్టీ యాక్టివిటీ సెక్రటరీ కొల్లాటి ఇజ్రాయిల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీవీ సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠం



సంపరలో ర్యాలీ చేస్తున్న సూపర్ వైజర్ తదితరులు

పెదపూడి: తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని, పుట్టిన బిడ్డకు తల్లి పాలు తప్పని సరిగా పట్టించాలని ఐసీడీఎస్ కాకినాడ అర్బన్ ప్రాజెక్టు సంపర సెక్టార్ సూపర్ వైజర్ చింతా శ్రీపద్మావతి అన్నారు. సంపర శివారు ముక్తేశ్వరంలో శనివారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడుతూ తల్లిపాల విశిష్టత, ప్రాధాన్యతను వివరించారు. షాపింగ్ మాల్స్, ఆలయాలు, రైల్వే, బస్ స్టేషన్లలో పిల్లలకు పాలివ్వడానికి ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారని, వాటిని తల్లులు వినియోగించుకోవాలన్నారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శ్రీరామచంద్రమూర్తి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తిబిరిశెట్టి ఆదినారాయణ, ఆరోగ్యశాఖ హెల్త్ హెడ్యూకేటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

బిక్కవోలు: తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీతారత్నం అన్నారు. మోళ్లూరులో ఆమె మాట్లాడుతూ తల్లి ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పాలు పట్టడం వల్ల వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అనంతలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: తల్లిపాలతో పిల్లలకు వ్యాధినిరోధకశక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ అసిస్టెంట్ సీడీపీవో పి.వరలక్ష్మి తెలిపారు. బొబ్బిల్లంకలోని ఐదు అంగన్‌వాడీ సెంటర్లు కలిసి సెంటర్-2 లో తల్లిపాల వారోత్సవాలు, తల్లుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు వి.రాధారాణి, ఎస్.సరోజ, జె.గంగాభవాని, ఎస్.పద్మ, బి.మణి పాల్గొన్నారు.

నానో ఎరువులకు కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం

సీతానగరం: నానో ఎరువులను కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తోందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ శ్యామ్ ప్రసాద్ బాబు అన్నారు. ఆయన మాట్లాడుతూ ఇఫ్కో సంస్థ నానో ఎరువులను ప్రవేశపెట్టిందని, రైతులకు ఎరువుల ఖర్చును తగ్గించి, నాణ్యమైన దిగుబడులు అందించడానికి ఇవి ఎంతో సహాయ పడతాయన్నారు.

ఘన నివాళి

అనపర్తి: నియోజకవర్గ ప్రెస్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ పాత్రికేయుడు టీవీఎస్ భీమరాజు మృతికి పలువురు ప్రముఖులు, పాత్రికేయులు సంతాపం తెలిపారు. అనపర్తి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రెస్‌క్లబ్ ఆవరణలో ఆయన సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా భీమరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహిళలకు బంగారు రూపుల పంపిణీ



బంగారు రూపులు పంపిణీ చేస్తున్న కంబాల శ్రీనివాసరావు

కోరుకొండ: గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణమంటపంలో శనివారం బంగారు వరలక్ష్మి కానుక-3 లక్కీడ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా 104 మంది మహిళలకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు బంగారు రూపులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావాలను విస్తృతం చేయడం ద్వారా సమాజంలో శాంతి ఏర్పడుతుందన్నారు. కులమతాలకు అతీతంగా మహిళలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. కాగా.. శ్రీరంగపట్నం పంచాయతీ గోడౌన్ వద్ద ఆదివారం లక్కీడ్రా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నానాజీ, ఉంగరాల మణిరత్నం, కటకం చలం పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించుకోకపోతే నగదు జమ చేయాలి



బలభద్రపురంలో మాట్లాడుతున్న హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ వనమయ్య

బిక్కవోలు: ఇళ్లు కట్టండి లేకపోతే నగదును జమ చేయండి అని లబ్ధిదారులతో ఇన్‌చార్జి హౌసింగ్ డీఈ వనమయ్య అన్నారు. మన ఇల్లు మన గౌరవం – గృహ లబ్ధిదారుల అవగాహన కార్యక్రమంలో భాగంగా బలభద్రపురం పంచాయతీ కార్యాలయంలో శనివారం ఆ గ్రామంలో లేఅవుట్ లబ్ధిదారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ వనమయ్య మాట్లాడుతూ ఇంటి నిర్మాణం చేస్తామని గ్రామంలో 204 మంది అడ్వాన్స్‌గా తీసుకున్నారన్నారు. వీరి ద్వారా రూ.38.30 లక్షలు ఇవ్వడం జరిగిందన్నారు. నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణ జరగాలని లేకపోతే ఆ నగదు జమ చేయాలన్నారు. దీనిపై పలువురు లబ్ధిదారులకు నోటీసులు అందజేశారు. కార్యక్రమంలోని ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేంద్ర ప్రసాద్, సర్పంచి బుంగా రామారావు, మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్య జయంతి

సీతానగరం: త్రివర్ణ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతిని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీజీయూ అధ్యాపకురాలికి పురస్కారం



డాక్టర్ అతిథి అభిషేక్‌ని అభినందిస్తున్న జీజీయూ చాన్సలర్ చైతన్యరాజు తదితరులు

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో ఆంగ్ల అధ్యాపకురాలిగా పనిచేస్తున్న డాక్టర్ అతిథి అభిషేక్‌కి 'దేవభూమి రాష్ట్రీయ రత్న పురస్కార్ – 2025' లభించింది. ఈ విషయాన్ని జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ సోషల్ ఫార్మ్ అండ్ హయర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ అండ్ ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (డెహ్రాడూన్) ద్వారా విద్యా సమాజానికి సహకారం అనే విభాగంలో ఈ పురస్కారాన్ని అందజేశారన్నారు. ఈ సందర్భంగా ఆమెను జీజీయూ చాన్సలర్‌తో పాటు వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్, తదితరులు అభినందించారు.

పారిశుధ్య చర్యలు మరింత మెరుగుపర్చాలి



చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో పారిశుధ్య చర్యలు మరింత మెరుగుపర్చాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. కుమారప్రియంలో జరుగుతున్న చెత్త తొలగింపు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రోడ్డుకిరువైపులా, గ్రామ వీధుల్లో చెత్త కుప్పలు, మురుగుగుంటలు తొలగించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించాలన్నారు. విపరీతమైన ఎండలు, ఒక్కసారిగా వానలు కురవడంతో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో సచివాలయం అధికారులు, ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటుకు అందరూ సహకరించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి సుంకర వీరస్వామి నాయుడు, సర్పంచ్ బిరద వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.